క్లుప్తంగా

అలరించిన భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో ఆదివారం బెంగుళూరుకి చెందిన హంసిని డాన్స్ అకాడమీ పూజఘోష్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. సంకీర్తన అలరిపు, పరంధామనే, నర్సింహకౌతం, అష్టలక్ష్మీ, అర్ధనారీశ్వరం, శృంగార పురధీశ్వర, మహాకాళి, దేవర్ణం, చూడరు, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు తేజశ్రీ, సూక్ష, ద్రిటి, నిర్మయి, విశాఖ, మానస తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

మియాపూర్: ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలుస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కె. వినయ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ క్రియాశీలక సభ్యుడైన ఆయనకు మంజూరైన రూ.2 లక్షలు ఆర్థికసాయం చెక్కును ఆదివారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ రూ. 2 లక్షల ప్రమాద బీమా అందిస్తుందన్నారు. ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లెళ్లమూడి అమ్మ శత జయంతి




తారానగర్‌లో అన్న ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లోని శ్రీ తుల్జాభవానీ ఆలయం వద్ద జిల్లెళ్లమూడి అమ్మ శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లెళ్ళమూడి అమ్మ పేరిట భవిష్యత్‌లోనూ సేవాకార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో 125 ప్రాంతాల్లో అన్న ప్రసాదం అందజేశామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ లంక పార్థసారధి, శ్రీనివాస్, పి.మురళి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌కాలనీలో ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్‌చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితసోమిరెడ్డి, కౌన్సిలర్ జ్యోతి పాల్గొన్నారు.

తవ్వి వదిలేశారు..



రైల్ విహార్ కాలనీ వద్ద గుట్టగా పోసిన బీటీ వ్యర్థాలు

శేరిలింగంపల్లి: రోడ్డు నిర్మాణ సమయంలో వచ్చే బీటీ వ్యర్థాలను గుట్టలు గుట్టలుగా పోసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో నల్లగండ్ల ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డులో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణ సమయంలో బీటీ వ్యర్థాలను రోడ్డు పక్కనే గుట్టలుగా పోయడంతో ఎగుడు దిగుడుగా మారిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వ్యర్థాలను ఎత్తివేసేందుకు కూడా బిల్లులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు జోక్యం చేసుకుని బీటీ వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి



ఖాజాగూడలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న దృశ్యం



పౌష్టికాహారం అందిస్తున్న టీచర్, ఆయా

- ఏప్రిల్ 3 వరకు 'పోషణ పక్షం' కార్యక్రమాలు
- నేడు చందానగర్‌లో శేరిలింగంపల్లి ప్రాజెక్టు స్థాయి కార్యక్రమం
- 'మిల్లెట్స్'పై ప్రత్యేక అవగాహన



చిన్నారుల బరువు, ఎత్తును పరిశీలిస్తున్న దృశ్యం

రాయదుర్గం: అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ పక్షం' కార్యక్రమాలు నిర్వహించనుండడంతో సందడి నెలకొంది. ఈ నెల 20 ఆరంభమైన 'పోషణ పక్షం' కార్యక్రమం ఏప్రిల్ 3 వరకు కొనసాగుతుంది. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిషోరబాలికలకు పోషకాహారం ఆవశ్యకతను వివరించి, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా తల్లులకు అవగాహన కల్పించేందుకు 15 రోజులపాటు ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని టీచర్లు, ఆయాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీభాయి, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి. ఇప్పటికే నానక్‌రాం గూడ, గౌలిదొడ్డి, రాజీవ్‌నగర్, సిద్ధిఖ్ నగర్ తదితరర ప్రాంతాల్లో రోజువారీ కార్యక్రమాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. శేరిలింగంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 76 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, ఐదు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 0–5 ఏళ్లలోపు వారు 13వేల మంది చిన్నారులు, 1500 మంది వరకు గర్భిణీలు, బాలింతలు ఉన్నారు.

చందానగర్‌లో ప్రత్యేక ప్రాజెక్టు స్థాయి కార్యక్రమాలు

పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా చందానగర్‌లోని జీహెచ్‌ఎంసీ కల్యాణ మంటపంలో ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

- కార్యక్రమంలో ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీభాయి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, బాలింతలు, గర్భిణీలు, కిషోర్‌బాలికలు, చిన్నారులు పాల్గొంటారు.

కార్యక్రమాలు ఇవీ..

- పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా రాగులు, జొన్నలు, గోధుమలు, ఇతర చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తారు.
- సామూహిక శ్రీమంతాలు, హెల్దీ చైల్డ్‌ల గుర్తింపు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- ఇంటింటికీ తిరిగి గర్భిణీలు, చిన్నారులు, కిషోరబాలికలకు పౌష్టికాహారంపై ప్రచారం చేస్తారు.
- చిన్నారుల ఎత్తు, బరువును గుర్తించడం, రికార్డు చేయడం, వారి ఆరోగ్యంపై తల్లులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించడం, జాగ్రత్తలు వివరించడం చేస్తారు.
- ఐసీడీఎస్ ద్వారా అందించే వాటిపై వివరించడం, సలహాలు చెప్పడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోవడంపై అవగాహన కల్పిస్తారు.

అవగాహన కల్పించేందుకే..



గర్భిణీలు, చిన్నారులు, బాలింతలు, కిషోర బాలికలకు ఆరోగ్యం, మిల్లెట్ల వినియోగం ద్వారా కలిగే లాభాలను వివరించడమే పోషణ పక్షం లక్ష్యం. మార్చి 20న ప్రారంభించిన ఈ కార్యక్రమం ఏప్రిల్ 3 వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం ప్రాజెక్టు స్థాయి కార్యక్రమాల నిర్వహణపై దృష్టి పెట్టాం. గర్భిణీలు, చిన్నారులు, బాలింతలు, కిషోరబాలికల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వారిలో అవగాహన పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఏటా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

–లక్ష్మీభాయి–
సీడీపీఓ శేరిలింగంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు

పేరుకుపోయిన చెత్త తొలగింపు



చెత్తను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది



చెత్త తొలగింపు అనంతరం

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: చెత్త సమస్య తీరింది. 'సాక్షి' దిన పత్రికలో 'చెత్త పేరుకపోవడంతో స్థానికుల ఆగ్రహం' శీర్షికన ప్రచురితమైన వార్తకు జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి అధికారులు స్పందించారు. వెంటనే చెత్తాచెదారం తొలగించాలని పారిశుద్ధ్య విభాగం సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఆదివారం ఉదయం జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి పారిశుద్ధ్య విభాగం సిబ్బంది నానక్‌రాంగూడలోని రేషన్ షాపు గల్లీలోని అంతర్గత రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. చెత్తను ఖాళీ స్థలంలో వేయరాదని, ఇంటింటికి తిరిగే జీహెచ్‌ఎంసీ రిక్షా వారికి తమకు ఇచ్చిన డబ్బాలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సిబ్బంది స్థానికులకు వివరించారు. అంతర్గత రోడ్డుపై చెత్త తొలగించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేపు పటాన్‌చెరుకు మంత్రి హరీశ్‌రావు రాక

పటాన్‌చెరు: పటాన్‌చెరుకు ఈనెల 28న మంగళవారం మంత్రి హరీశ్‌రావు వస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మంగళవారం జీఎంఆర్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో రూ.2.10 కోట్లతో కొనుగోలు చేసిన 210 ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. అలాగే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ వరకు రూ.10 కోట్లతో నిర్మించ తలపెట్టిన మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

పటాన్‌చెరు టౌన్: ఏప్రిల్ 16న నిర్వహించే భీమ్ దీక్ష ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని స్వేరోస్ పూర్వవిద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని చైతన్యనగర్ కాలనీలోని బాబు జగ్జీవన్‌భవన్‌లో బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహనీయుల త్యాగాలు స్మరించుకుంటూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 14 వరకు పవిత్ర దీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్, రవి, మహేందర్, గడ్డమీది రమేశ్, సంతోష్, ప్రేమ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి కాలనీ వాసులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ విజయవంతం చేయడంలో కాలనీవాసులు భాగస్వాములు కావాలని కోరారు. కాలనీ రోడ్లపై చెత్త కుప్పలు, చెట్ల కొమ్మలు వేయరాదని, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సమాచారం అందిస్తే వాటిని తొలగిస్తారన్నారు. ఇంట్లోనే చెత్తను తడి, పొడి చెత్తలను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. కాలనీల్లోని బహిరంగ స్థలాల్లో మల విసర్జన చేయకుండా జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన టాయిలెట్లను వినియోగించుకుని పరిశుభ్రత పాటించాలని కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీహెచ్‌ఎంసీని ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ భరత్, ఎస్ఎఫ్ఏలు జిలానీ, రాజేష్, కాలనీ ఉపాధ్యక్షులు బుచిరెడ్డి, సెక్రటరీ మహేష్ గౌడ్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీ మన జీవితంలో భాగమైంది



టీ చాంపియన్‌షిప్ విజేతలకు చెక్కులు అందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మాదాపూర్: మనిషి జీవిత దినచర్య టీ తాగడంతోనే ప్రారంభమవుతుందని, అందుకే టీ(తేనీరు) మన జీవనంలో ఒక భాగమైందని కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం హైబిజ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ చాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. టీ విక్రయించిన వ్యక్తి ఇప్పుడు మనకు ప్రధానిగా ఉన్నారని చెప్పారు. ఏ ఇద్దరు స్నేహితులు, బంధువులు కలిసినా తప్పకుండా టీ కలిసి తాగుతుంటారని, అలా టీతో మన అనుబంధం పెనువేసుకుందన్నారు. టీలలో ఇన్ని రకాలు ఉంటాయని తనకు ఈరోజే తెలిసిందన్నారు. కాగా ఈ పోటీలలో 200 మంది మహిళలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా టీ బోర్డు చైర్మన్ సౌరవ్ పహరి, మానేపల్లి సంస్థ చైర్మన్ రామారావు, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సోమా భరత్‌కుమార్, మాడిశెట్టి రాజగోపాల్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



టాయిలెట్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

రాయదుర్గం: చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ వి.పాపారావు అన్నారు. ఆదివారం గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గోల్ఫ్ ప్రాక్టీస్ చేసే బాలికల సౌకర్యార్థం రూ.3 లక్షలతో ఐలాండ్ వీర్ కెమి ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డీవీఎన్‌రాజు, హైదరాబాద్ లేడీస్ సర్కిల్ 43, ప్రాజెక్ట్ 511 సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన బాలికల టాయిలెట్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. గోల్ఫ్‌లో ఇప్పటికే పలువురు బాలికలు మెడల్స్ సాధించారన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గురుకుల సంస్థ ఓఎస్‌డీ చంద్రకాంత్‌రెడ్డి, ఆర్‌సీఓ డాక్టర్ శారదా వెంకటేష్, జ్యోతి, విశాల, కీర్తి, సింధు, అనూష, శృతి, వీరేశం, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నిద్రలేమి అనారోగ్యాలకు మూలం

కాంటినెంటల్ ఆస్పత్రిలో ప్రత్యేక నిద్రరుగ్మతల విభాగం ప్రారంభం



నిద్ర రుగ్మతల విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జే.సీ.సూరి, డాక్టర్ గురు ఎన్ రెడ్డి

రాయదుర్గం: నిద్రలేమి అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మూలమని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురుఎన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ నిద్రాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నానక్‌రాంగూడ కాంటినెంటల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిద్రరుగ్మతల విభాగాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ జే.సి.సూరితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ జే.సీ.సూరి మాట్లాడుతూ నిద్రకు సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. నిద్ర రుగ్మతలపై అత్యాధునిక హంగులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ గురుఎన్‌రెడ్డి మాట్లాడుతూ కాంటినెంటల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో నిద్ర సంబంధిత రుగ్మతల నివారణకు చికిత్స అందిస్తామన్నారు. పల్మనాలజీ విభాగం అధిపతి డాక్టర్ నళిని నాగళ్ల మాట్లాడుతూ నిద్రలేమి, తత్సంబంధిత ఇబ్బందులు అన్ని రకాల అనారోగ్య లక్షణాలకు మూలమన్నారు. కార్యక్రమంలో కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యబృందం, పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యం



కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న రైల్‌విహార్ కాలనీవాసులు

శేరిలింగంపల్లి: డివిజన్ పరిధిలో అందరికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన రైల్‌విహార్‌కాలనీలో మంజీరా తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతికాలనీ, బస్తీలో మంచినీటిని సరఫరా చేసేందుకు పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. స్వచ్ఛమైన నీటిని ఇంటింటికీ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైల్‌విహార్ కాలనీలో తాగునీరు కలుషితం కావడంతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను తమ దృష్టికి తేవడంతో పైప్‌లైన్ ఏర్పాటుకు మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం కార్పొరేటర్‌ను స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి హరీష్ బాబు, కోశాధికారి శ్రీనివాస్‌నాయక్, స్థానికులు ముత్తుస్వామి, బాబురావు, మణి, బలరామ్, గోపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటేల్‌గూడ గ్రామ పరిధిలోని సిద్ధార్థ ఎన్‌క్లేవ్ కాలనీలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా రూ.60 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనంతరం కాలనీ వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ నీతీశా శ్రీకాంత్, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, ఉప సర్పంచ్ జానకి జ్ఞానేశ్వర్, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ తులసి రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. దుర్గానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కొడెల నుంచి కాలనీ వరకు మహిళలు కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. పారిశ్రామిక రంగంలో చేపడుతున్న సంస్కరణల మూలంగా.. నూతన పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. దీనికి అనుగుణంగానే పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, ఉప సర్పంచ్, దుర్గా నగర్ కాలనీ అధ్యక్షుడు ఎండి ఫహీం, అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తులసి రెడ్డి, రాజు, యూనిస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి



మాట్లాడుతున్న కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి

మియాపూర్: మియాపూర్‌లోని సర్వే నెంబర్ 100,101లో ఉన్న ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చందానగర్‌లోని జనం కోసం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మియాపూర్ పరిధిలోని సర్వే నెంబర్ 100,101 లో ఉన్న 445 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారన్నారు. సదరు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొందరు వ్యక్తులు ఈ భూమి ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్ ఆఫీసర్, హెచ్‌ఎండీఏ కమిషనర్, జోనల్ కమిషనర్ అధికారులు నివేదికలతో సహా కోర్టు ఎదుట హాజరు కావాలని న్యాయస్థానం ఇప్పటికే ఆదేశించిందన్నారు. తదుపరి విచారణకు అధికారులు హాజరు కాలేకపోతే కోర్టు ధిక్కరణ కింద ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ భూమిని నిషేధిత జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్లు జరగకుండా చూడాలని అధికారులను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ నాగం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



నడిగడ్డతాండలో పర్యటిస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

మియాపూర్: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం. రవికుమార్‌యాదవ్ అన్నారు.ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని నడిగడ్డతాండలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు బోరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఆర్‌పీఎఫ్ జవాన్లు కాలనీలోకి ఎలాంటి వస్తువులను అనుమతించడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నడిగడ్డతాండను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నడిగడ్డతాండ అధ్యక్షులు తిరుపతినాయక్, రెడ్యానాయక్, దేవునూరి చందు, సీతారాం నాయక్, ఆకుల లక్ష్మణ్, రామకృష్ణ, గణేష్ ముదిరాజ్, వెంకట్, నడిగడ్డతాండ వాసులు తదితరులు పాల్గొన్నారు.